క్లుప్తంగా

వైద్యాధికారికి సత్కారం



వైద్యాధికారి శైలజను సన్మానిస్తున్న జిల్లా వైద్యాధికారి స్వప్న, సోమరాజు

ఏలేశ్వరం: ఉత్తమ వైద్యాధికారిగా అవార్డు అందుకున్న శైలజను మండల పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉద్దగిరి సోమరాజు ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారి స్వప్న చేతుల మీదుగా స్థానిక సీహెచ్‌సీలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ సేవలు అందిస్తున్న వైద్యాధికారి శైలజకు అవార్డు రావడం అభినందనీయమన్నారు. ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

- మండల పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉద్దగిరి సోమరాజు ఆధ్వర్యంలో రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. సోమరాజు తండ్రి చిన బుచ్చిరాజు 65వ వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు వీటిని జిల్లా వైద్యాధికారి స్వప్న చేతుల మీదుగా అందజేశారు. అసోసియేషన్ సభ్యులు చెన్నాప్రగడ సత్యగాంధీ, కంచుపట్ల కృష్ణ, ఇబ్రహీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



ర్యాలీ చేస్తున్న కార్మిక నాయకులు

ఏలేశ్వరం: ఆల్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ (ఏఐసీసీటీయూ) జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఏలేశ్వరంలో గురువారం కార్మికులు ర్యాలీ నిర్వహించారు. వచ్చే నెల 24 నుంచి 26 వరకు ఢిల్లీలో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ పాలనలో కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకంలో 200 రోజుల పని కల్పించి, రూ.600 కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఏఐసీసీటీయూ నాయకుడు గొడుగు సత్యనారాయణ, రాజబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ వద్దు



విద్యార్థినితో మాట్లాడుతున్న విజయ్‌మోహన్

తుని రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లా మిడ్డే మీల్స్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌మోహన్ తనిఖీ చేశారు. గురువారం తుని మండలం ఎస్.అన్నవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆహార పదార్థాలను చూసిన ఆయన భోజనాలు బాగున్నాయా, లేదా అని విద్యార్థులను, మెనూ అమలు చేస్తున్నారా అని హెచ్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజనాల నాణ్యతలో రాజీ పడవద్దని హెచ్‌ఎంలకు సూచించారు. హెచ్‌ఎంలు వెంకటేశ్వరరావు, అత్తి అనంత పద్మనాభం, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

తొండంగి: పెరుమాళ్లపురం పంచాయతీ బుచ్చియ్యపేట గ్రామంలో గురువారం ఓ పూరిల్లు కాలిపోయింది. స్థానికుల కథనం ప్రకారం.. ఆ గ్రామానికి చెందిన అంబుజాలపు సింహాచలం కుటుంబ సభ్యులు ఇంట్లో వంట చేస్తుండగా అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో సింహాచలం భార్య వెంకాయమ్మకి గాయాలవ్వగా, పెద్ద ఎత్తున మంటలు చేలరేగి ఇల్లు, అందులోని గృహోపకరణాలు కాలిపోయాయి. అగ్నిమాపక అధికారులు వచ్చే లోపే ఇల్లు మొత్తం కాలిపోయింది. ఎమ్మెల్యే యనమల దివ్య ఆదేశాల మేరకు టీడీపీ నాయకుడు యనమల నాగేశ్వరరావు రూ.పది వేల తక్షణ సాయం అందించారు.

నేడు ఆత్మీయ సమావేశం


ప్రత్తిపాడు రూరల్: ఒమ్మంగిలో శుక్రవారం ఉదయం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులి రామకృష్ణ గురువారం తెలిపారు. నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని ఈ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రత్తిపాడు: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో కల్లుగీత కార్మికులకు రిజర్వు చేసిన ప్రాంతాల్లో మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ శివప్రసాద్ తెలిపారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, కిర్లంపూడి మండలాల కల్లుగీత కార్మికులు శెట్టిబలిజ కుల ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తులను ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో అందించాలని వివరించారు.

ఉంచుతారా... ఊహు అంటారా!

- ఇళ్లు నిర్మించని స్థలాల పరిశీలనకు ప్రత్యేక కమిటీలు
- మూడు సెంట్ల స్థలం ఇస్తామంటూ ప్రచారం
- లబ్ధిదారుల్లో అయోమయం



తుని రాజుపేట లేఅవుట్‌లో నిర్మించుకుంటున్న ఇళ్లు



లోవకొత్తూరు లేఅవుట్‌లో పునాదుల దశలో నిర్మాణాలు

తుని రూరల్: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు గత ప్రభుత్వం ఎంతో సహకారం అందించింది.. అందరికీ ఇళ్లు పథకంలో స్థలాలు ఇచ్చింది. ఇప్పుడేమో ఆ లక్ష్యాన్ని నీరుగార్చేందుకు కూటమి ప్రభుత్వం పన్నాగం పన్నుతున్నట్లు కనిపిస్తోంది. మూడు సెంట్ల ఇళ్ల స్థలం, యూనిట్ రేటు పెంపు ప్రకటనలతో లబ్ధిదారుల్లో అయోమయం సృష్టిస్తుంది. ఇప్పటికే స్థలాలు పొందిన మెజార్టీ లబ్ధిదారుల్లో కొంతమంది ఇళ్లు నిర్మించుకోవడం, మరికొంత మంది ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. మూడో వంతు లబ్ధిదారులు ఆర్థిక స్తోమత లేక నిర్మాణాలు చేపట్టలేదు. ఈ మూడో వంతు లబ్ధిదారులను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం ఇళ్ల స్థలాల రద్దు, అర్హులకు మూడు సెంట్లు స్థలం అంటుంది. దీంతో మూడు సెంట్లు వస్తుందో లేదోనని, ఉన్న స్థలాన్ని కోల్పోతామన్న భయం వారిలో నెలకొంది. గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేట్ భూములు సేకరించి లేఅవుట్లు వేసింది. నియోజకవర్గంలో అర్హులుగా గుర్తించి 10,460 మందికి లక్షల విలువైన ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా వేలాది మంది మహిళల పేరుతో రిజిస్ట్రేషన్లు చేసింది. దీంతో 3,994 మంది ఇళ్లు నిర్మించుకుని గృహ ప్రవేశాలు చేశారు. మరో 2,766 మంది ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఆర్థిక స్తోమత అనుకూలించకపోవడంతో 3,700 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు.

ఇళ్ల స్థలాలకు ప్రత్యేక కమిటీలు

ఇప్పటికే ఉన్న స్థలాల్లో ఎవరెవరు ఇళ్లు నిర్మించలేదో గుర్తించేందుకు క్షేత్ర స్థాయిలో రెవెన్యూ అధికారులకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. స్థలాలను పరిశీలించి అర్హులను గుర్తించాలని, అనర్హులను తొలగించాలని ఆదేశిస్తూ జీఎంఎస్ నంబర్ 23ను గత నెల 27న ప్రభుత్వం ఆర్డర్ జారీ చేసింది. జిల్లా స్థాయిలో ఇన్‌చార్జి మంత్రి చైర్మన్‌గా కలెక్టర్ కోచైర్మన్‌గా మరో పది మంది సభ్యులుగా పేర్కొంది. రాష్ట్ర స్థాయిలో కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు రెవెన్యూ మంత్రి చైర్మన్‌గా మరో ఎనిమిది మంది సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేసింది.

కేటాయింపు ఇలాగట..

గత ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి సెంటున్నర స్థలాన్ని కేటాయించింది. ప్రస్తుత ప్రభుత్వం గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇవ్వాలని నిర్ణయించింది. తుని పట్టణంలో ఇళ్ల స్థలాలు లేకపోవడంతో గత ప్రభుత్వం తుని మండలం రాజుపేటలో 5,383 కుటుంబాల పట్టణ వాసులకు ఇళ్ల స్థలాలు కేటాయించింది. అందులో ఇప్పటికే 1,243 మంది ఇళ్లు నిర్మించుకోగా, మరో 1,731 మంది ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి. 2,409 మంది నిర్మాణాలు చేపట్టలేదు. ఇప్పుడు ఈ స్థలాలను రద్దీ చేసి అర్హులకు రెండు సెంట్లు ఇస్తారా అనే సందేహం కలుగుతుంది. అలాగే గ్రామీణుల్లో 2,751 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. మరో 1,035 మంది నిర్మించుకుంటుండగా, 1,291 మంది ఇంకా చేపట్టలేదు. వీరి స్థలాలు రద్దయితే మళ్లీ మూడు సెంట్ల స్థలాలు వస్తాయో రావోనన్న అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాలు ఇలా..

మండలం	మంజూరైన ఇళ్లు	పూర్తయినవి	నిర్మాణ దశలో ఉన్నవి	చేపట్టాల్సినవి
కోటనందూరు	629	159	215	255
తొండంగి	2,139	1,455	286	398
తుని రూరల్	2,309	1,137	534	638
తుని పట్టణం	5,383	1,243	1,731	2,409

భూసేకరణ చేయాలి

ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. గైడ్‌లైన్స్ రావాల్సి ఉంది. పట్టణ వాసులకు రెండు, గ్రామీణులకు మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి వస్తే అదనంగా భూసేకరణ చేయాల్సి ఉంది. ఇప్పటికే ప్రభుత్వ భూములన్నీ వేర్వేరు అవసరాలకు వినియోగించారు. ఉన్నత అధికారుల నుంచి విధి విధానాలు వస్తే అందుకు అనుగుణంగా పని ప్రారంభిస్తాం. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు లభిస్తాయి.

– గిడుతూరి వెంకట సత్యప్రసాద్, తహసీల్దార్, తుని

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ప్రత్తిపాడు: ధర్మవరం, ఉత్తరకంచి సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఆ శాఖ జగ్గంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తరకంచి సబ్ స్టేషన్ మరమ్మతులు, విద్యుత్ తీగల కింద చెట్ల కొమ్మలను తొలగించే నిమిత్తం సరఫరాను నిలుపుదల చేస్తున్నామన్నారు. దీనివల్ల ధర్మవరం, పాదురుపాక, పాండవుల పాలెం, చినశంకర్లపూడి, పెద్దిపాలెం, లంపకలోవ, గోకవరం, వంతాడ, బవురువాక, శరభవరం, గజ్జనపూడి, చింతలూరు, శాంతి ఆశ్రమం, వెంకటనగరం, ఉద్దండ జగన్నాథపురం, ఉత్తరకంచి, పోతులూరు, వాకపల్లి, పెదశంకర్లపూడి, వేములపాలెం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

తుని: విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా పట్టణంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాండవ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ సీతారాంపురం ఫీడర్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపుతో డీమార్ట్, కొండవారిపేట, టైలర్స్ కాలనీ, కంకిపాటివారి గరువు, అమ్మాజీపేట, సీతారాంపురం, టీబీ బంగ్లారోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

గోకవరం: 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం గోకవరంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ వైవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యక్తిగత శుభ్రతతో వ్యాధుల నివారణ



వ్యాధి నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ శ్రీలత, వైద్య సిబ్బంది



అచ్యుతాపురంలో కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

కిర్లంపూడి: వ్యక్తిగత శుభ్రతతో వ్యాధులను నివారించవచ్చని జగపతినగరం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యురాలు టి.సాయిహేమాంజలి ఆధ్వర్యంలో గురువారం కుష్ఠు వ్యాధి నివారణ దినోత్సవానికి సర్పంచ్ శ్రీలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయిహేమాంజలి మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి అవగాహన పక్షోత్సవాల్లో భాగంగా జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకూ వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేస్తున్నారన్నారు. కుష్ఠు వ్యాధి కారక లక్షణాలు కనిపిస్తే ఎండీటీ పద్ధతి ద్వారా వ్యాధిని నివారించవచ్చన్నారు. అనంతరం వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. తొలిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

గోకవరం: అచ్యుతాపురం గ్రామంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుష్ఠు వ్యాధి నివారణకు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్ఎల్‌హెచ్ మౌనిక వ్యాధి లక్షణాల గురించి వివరించారు. కుష్ఠు వ్యాధి పూర్తిగా మందులతో నవయమవుతుందని, దీనికి ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ పి.రాజేశ్వరి, ఏఎన్ఎం మంగాదేవి, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ పిట్టా అరుణ్, నాయకులు కాశీ, హెల్త్ అసిస్టెంట్ రాజు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

శంఖవరం: అచ్చంపేట గ్రామంలో వైఎస్సార్ సీపీ నేత, ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ మదునూరి మురళీకృష్ణంరాజు పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల ఆపరేషన్ చేయించుకున్న కుండల రమణను పరామర్శించి రూ.5 వేలు అందజేశారు. సర్పంచ్ బొట్టా చైతన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఈగల అప్పారావు, నాయకులు పల్లా అప్పలరాజు, బర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



పెద్ద చెరువులో ఉపాధి పనుల మస్తర్లను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి

రౌతులపూడి: ములగపూడిలో ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి గురువారం పరిశీలించారు. అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని, గిట్టుబాటు వేతనం వచ్చేలా చూడాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనులు జరిగేలా చూడాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. పెద్ద చెరువులో జరుగుతున్న ఉపాధి పనులకు సంబంధించి మస్తర్లను ఆమె పరిశీలించారు. ములగపూడి, బంగారయ్యపేట గ్రామాల్లో రూ.2.30 లక్షలతో గోశాల నిర్మాణ పనులు, రూ.8 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ తమరాన సత్యనారాయణ, డ్వామా ఏపీడీ పి.జగదాంబ, ఏపీఓ డి.సురేష్ పాల్గొన్నారు.

గాంధీ మహాత్మునికి నివాళి



ఏలేశ్వరంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: జాతిపిత గాంధీ మహాత్ముని వర్ధంతి కార్యక్రమాన్ని స్థానికంగా గురువారం నిర్వహించారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్, ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక షిర్డీనగర్ గాంధీనగర్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విగ్రహ దాత కోరాడ అప్పలస్వామి, ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్, చందక రాజారామ్మోహనరావు, వీబీజీ తాతాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు పతివాడ జగదీష్, చందక కిరణ్, కావలి శ్రీనివాసరావు, ఉడతల రమణారావు, దాసరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: స్థానిక నూకాలమ్మగుడి ప్రాంతంలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీ విగ్రహానికి క్లబ్ ప్రతినిధులు పూలమాలలు వేశారు. క్లబ్ ప్రతినిధులు వెలగా రాజబాబు, వెలగా వెంకటకృష్ణాజీ, కొల్లూరి వీరబాబు, బత్తుల వెంకన్నబాబు, వెలగా కృష్ణ పాల్గొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఎస్సై టి.రామకృష్ణ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కోటనందూరులో గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరంలో గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీ కృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి ఆయన పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, పోకనాటి వెంకటేశ్వరరావు, జువ్వల దొరబాబు, కోన బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫిజియోథెరపీ శిబిరం

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఫిజియోథెరపీ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. విశాఖ న్యూ నిజామ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు ఫిజియోథెరపీపై అవగాహన సదస్సు, అనంతరం వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరంలో వివిధ శాఖల అధికారులు, ఆయా శాఖల సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొని, సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

లాభాల పంట పామాయిల్

జగ్గంపేట: మెట్ట ప్రాంత మండలాల్లో నేలలు పామాయిల్ సాగుకు అనుకూలంగా ఉన్నాయని, ఈ సాగుపై రైతులు దృష్టి సారించాలని పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ప్లాంటేషన్ హెడ్ వి.పట్టాభిరామారెడ్డి తెలిపారు. గుర్రంపాలెం గ్రామంలో గురువారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సాగుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందని చెప్పారు. విదేశాల నుంచి వచ్చిన మొక్కలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని, పామాయిల్ సాగు చేయాలనుకునే రైతులు మార్చిలోపు వీటిని సాగు చేసుకోవచ్చని చెప్పారు.

ఎండు గడ్డికి యమ గిరాకీ



ట్రాక్టర్‌లో ఎండుగడ్డి తరలింపు

కోటనందూరు: సాగులో యాంత్రీకరణ అందుబాటులోకి వచ్చిన తరువాత వరి ఎండుగడ్డికి డిమాండ్ ఏర్పడింది. వరి పంటను యంత్రంతో కోస్తే పశువులు తినడానికి అనువైన ఎండుగడ్డి వచ్చే పరిస్థితి ఉండదు. మెట్ట ప్రాంతంలో ముఖ్యంగా కోటనందూరు మండలం పరిసర ప్రాంతంలో అవసరం మేర కూలీలు అందుబాటులో ఉండడంతో వరి కోతలకు యంత్రాలను వినియోగించరు. దీంతో ఈ ప్రాంతంలో ఎండుగడ్డి రైతుల అవసరానికి మించి ఎక్కువగా అందుబాటులో ఉంటుంది. ఈ ప్రాంతంలో ప్రతి ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకూ వరికుప్పలు నూర్పిడి చేయడం పరిపాటి. ప్రస్తుతం కోనసీమతో పాటు పట్టణ ప్రాంతాలకు రోజూ భారీగా గడ్డి ట్రాక్టర్లలో తరలిపోతుంది. ట్రాక్టర్ గడ్డి రూ. 15 వేల నుంచి దూరాన్ని బట్టి రూ. 25 వేల వరకూ పలుకుతుందని వ్యాపారులు చెబుతున్నారు. అవసరానికి మించి అందుబాటులో ఉన్న రైతులు గడ్డిని విక్రయిస్తున్నారు.

మాతంగి రాజశ్యామలదేవిగా దుర్గమ్మ



మాతంగి రాజశ్యామలదేవి అలంకారంలో కనకదుర్గమ్మకు పూజలు చేస్తున్న అర్చకుడు

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ గురువారం మాతంగి రాజశ్యామల దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీశ్యామల నవరాత్రులను పురస్కరించుకుని తొలిరోజు ఆలయంలో కనకదుర్గమ్మను ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, అర్చకుడు శ్రీనివాస్‌శర్మలు మాతంగి రాజశ్యామలదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. డాక్టర్ జగన్నాథశర్మ మాట్లాడుతూ శ్యామల నవరాత్రులను పురస్కరించుకుని తొమ్మిది రోజుల పాటు అమ్మవారు మాతంగి శ్యామలదేవిగా దర్శనమిస్తారన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆదేశాలు

గండేపల్లి: సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ ఇచ్చినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. రోడ్డు వెంబడి ఉన్న దుకాణాలు, బంకులు, ఇతర సంస్థల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుపై యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశామన్నారు.

సంఘటితంగా శ్రీసత్యసాయి ఉత్సవాలు



శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రత్తిపాడు: ఈ ఏడాది నవంబర్ 23వ తేదీ వరకూ శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాలను సంఘటితంగా నిర్వహించాలని శ్రీసత్యసాయి సేవా సమితి తుని సబ్‌జోన్ కన్వీనర్ తుమ్మలపల్లి జోగేంద్రనాద్ కోరారు. ప్రత్తిపాడులోని శ్రీసత్యసాయి సేవా కేంద్ర భవన్ 18వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. తొలుత ప్రశాంతి పతాకాన్ని సేవా సమితి కన్వీనర్ ఎస్వీ సూర్యనారాయణ ఆవిష్కరించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం రాజమహేంద్రవరం నిడదవోలు సూరిబాబు బృందం ఆధ్వర్యంలో సామూహిక భజనలు జరిపారు. జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు, కిర్లంపూడి సబ్ జోన్ కన్వీనర్ కొమ్ముల జయబాబు, జిల్లా విద్యా జ్యోతి సమన్వయకర్త జె.సాయిలక్ష్మి, పెద్దాపురం జోనల్ కన్వీనర్ ఒబ్బిలిశెట్టి లక్ష్మీనారాయణ, పి.నాగేశ్వరరావు, ఎం.లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర శిబిరం

స్థానిక శ్రీసత్యసాయి సేవా సదన్ భవనం వద్ద ఉచిత నేత్ర శిబిరాన్ని నిర్వహించారు. దీనిని సీనియర్ న్యాయవాది కొల్లా వీర్రాజు ప్రారంభించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయ ఆధ్వర్యంలో 127 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందజేశారు. జిల్లా మహిళా సేవాదళ్ సమన్వయకర్త తుమ్మలపల్లి చిట్టి కామేశ్వరి, జిల్లా ఉచిత వైద్య శిబిరాల సమన్వయకర్త ఏవీఎస్ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం



గండేపల్లిలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, అధికారులు

గండేపల్లి: గ్రామాల్లో శాఖా పరమైన సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కలసి పనిచేద్దామని ఎంపీపీ చలగళ్ల దొరబాబు తెలిపారు. గురువారం గండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులకు సంబంధించిన సమస్యలు, అవసరాలు ఏమైనా ఉంటే మండల పరిషత్ దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సహకారంతో జిల్లా స్థాయి అభివృద్ధి సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాతి బుజ్జి, తహసీల్దార్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన



వీరలంకపల్లి రామకృష్ణా గార్డెన్స్‌లో మామిడి పూతను పరిశీలిస్తున్న ఉద్యాన శాస్త్రవేత్తలు

గోకవరం: వీరలంకపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సాగిస్తున్న రైతులకు రామకృష్ణ గార్డెన్స్‌లో గురువారం గ్రామీణ ఉద్యాన కృషి అనుభవం కార్యక్రమంలో భాగంగా ఉద్యాన పంటలపై రైతు సదస్సు నిర్వహించారు. కోరుకొండ ఉద్యాన శాఖ అధికారి రిని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పందిరిమామిడి సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ పీసీ వెంగయ్య, డాక్టర్ జె.మణికుమార్, డాక్టర్ రాఘవేంద్రలు పాల్గొని ఉద్యాన పంటలపై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే మామిడి, జీడిమామిడి పూతలను పరిశీలించి సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఇందులో భాగంగా ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామి మాట్లాడుతూ గోకవరం మండలంలో రైతులు ఎక్కువగా మామిడి, జీడి మామిడి సాగు చేస్తున్నారని, ఈ ప్రాంతంలో వీటికి సంబంధించిన పరిశ్రమ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సదస్సులో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం విద్యార్థులు ఉద్యాన, వ్యవసాయ పంటల నమూనాలను ప్రదర్శించారు. వెదురుపాక, బవాజీపేట, వీరలంకపల్లి గ్రామాలకు చెందిన సుమారు వంద మంది ఉద్యాన రైతులు పాల్గొన్నారు.

ప్రమాదం మంచుకొచ్చేలా...



బెండపూడి జాతీయ రహదారిపై కమ్మేసిన పొగ మంచు

తొండంగి: బెండపూడి జాతీయ రహదారిపై పొగ మంచు కమ్మేస్తోంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం ఐదున్నర గంటల నుంచి దాదాపు రెండు గంటలపాటు దట్టమైన మంచు జాతీయ రహదారి వెంబడి కమ్మేయడంతో రాకపోకలు సాగించే వాహనదారులకు ముందు వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బందులు పడ్డారు. కొద్దిమంది వాహనాలను ఖాళీ ప్రదేశాల్లో పార్కింగ్ చేసి మంచు తొలగిన తర్వాత రాకపోకలు సాగించారు. కొద్ది రోజులుగా భిన్నమైన వాతావరణంతో తరచూ పొగ మంచు రావడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.